సీఎం కేసీఆర్ పర్యటన సైడ్‌లైట్స్



సీఎం కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న సండ్ర వెంకటవీరయ్య కుమారులు

- మధ్యాహ్నం 2.42గంటలకు ముఖ్యమంత్రి కేసీఆర్ కల్లూరులో హెలీకాప్టర్ దిగారు.
- మధ్యాహ్నం 2.50గం.కు హెలీప్యాడ్ నుంచి ప్రత్యేకబస్సులో సభావేదిక వద్దకు చేరుకున్నారు.
- మధ్యాహ్నం 3గం.కు మొదలైన సీఎం కేసీఆర్ ప్రసంగం 40 నిమిషాల పాటు సాగింది.
- మధ్యాహ్నం 3.48గంటలకు కల్లూరు నుంచి హెలీకాప్టర్‌లో బయలుదేరారు.
- మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, ఎమ్మెల్సీ తాతా మధు, రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారధిరెడ్డి.. సీఎం కేసీఆర్‌కు స్వాగతం పలికారు.
- హెలీకాప్టర్‌లో సీఎం కేసీఆర్‌తో పాటు ఎమ్మెల్సీ మధుసూదనాచారి, ఎంపీ నామా నాగేశ్వరరావు వచ్చారు.
- ఎంపీ ప్రభాకర్‌రెడ్డిపై దాడి నేపథ్యాన భారీ బందోబస్తు ఏర్పాటు చేయగా, వీఐపీలు, మీడియా గ్యాలరీల్లోకి వచ్చే వారిని మెటల్ డిటెక్టర్లతో తనిఖీ చేశాకే అనుమతించారు.
- ప్రజా ఆశీర్వాద సభకు జనం పోటెత్తగా, దూరంగా ఉన్న వారికీ వేదిక కనిపించేలా ఎల్ఈడీల్లో ప్రత్యక్ష ప్రసారం చేశారు.
- సీఎం రాక ముందు గాయకులు మధుప్రియ, మానుకోట రామకృష్ణ పాడిన పాటలు ఉత్సాహాన్ని నింపాయి.
- మధ్యాహ్నం నుంచే ప్రజలు పెద్ద సంఖ్యలో సభావేదిక వద్దకు తరలిరాగా, ఫ్లెక్సీలు, బ్యానర్లు, కటౌట్లతో సభావేదిక పరిసరాలు గులాబీమయమయ్యాయి.
- సీఎం కేసీఆర్ ప్రసంగిస్తున్నప్పుడు సభికుల నుంచి మంచి స్పందన లభించింది.
- సీటీలు, ఈలలు చివరిరోజు వేద్దాం.. ఇప్పుడు వద్దంటూ సీఎం కేసీఆర్ తన ప్రసంగంలో చెప్పారు.

– సత్తుపల్లిటౌన్ / కల్లూరురూరల్

'ఆధార్' అవస్థలు..!



మధిర మెయిన్ రోడ్‌లోని ఆధార్ కేంద్రం వద్ద క్యూలో ప్రజలు

సర్వర్ సమస్యలతో అప్‌డేట్‌లో జాప్యం
- కేంద్రాల వద్ద బారులుదీరుతున్న జనం
- ఉదయం నుంచే పడిగాపులు కాస్తున్న వైనం
- పట్టించుకోని అధికారులు

ప్రస్తుత తరుణంలో అన్నింటికీ ఆధార్ ఆధారమైంది. ఆధార్ దిగి పదేళ్లు దాటిన వారు నవీకరించుకోవాలని అధికారులు సూచిస్తుండడంలో చిన్న పిల్లల దగ్గర నుంచి పెద్దల వరకూ అప్‌డేట్ చేయించుకునేందుకు ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వ పథకాలు పొందాలన్నా, విద్యాసంస్థల్లో ప్రవేశాలు, బ్యాంకు ఖాతాలు, పింఛన్లు, రేషన్ కార్డులు, అడ్రస్, పేర్ల మార్పు వంటి తదితర వాటి కోసం దరఖాస్తు చేసుకునేందుకు ప్రజలు పెద్ద ఎత్తున ఆధార్ కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. కానీ సరిపడా ఆధార్ కేంద్రాలు లేక, సర్వర్ సమస్యలతో కార్డు పొందేందుకు ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు.

మధిర: మధిర పట్టణంలో ఆధార్ కార్డు పొందాలంటే ప్రాణ సంకటంగా మారింది. పట్టణంలో ఉన్న రెండు మీ సేవా కేంద్రాలు మెయిన్‌రోడ్‌లోని పోలీస్ స్టేషన్‌కు ఎదురుగా తెలంగాణ గవర్నమెంట్ మీ సేవా కేంద్రం, తహసీల్ వెనుక భాగాన కూరగాయల మార్కెట్‌రోడ్‌లో ఉన్న మీ సేవా కేంద్రాల్లో తెలంగాణ గవర్నమెంట్ మీ సేవా కేంద్రం మాత్రమే నిరంతరంగా పనిచేస్తుంది. ఈనేపథ్యాన పట్టణంతో పాటు చుట్టుపక్కల పల్లెలు, ఆంధ్రాలోని పలు మండలాలకు చెందిన ప్రజలు సుమారు 2 లక్షల మంది ఆధార్ కార్డులో మార్పులు, చేర్పులు, కొత్త ఆధార్ కార్డులు, ఇతరాత్ర పనుల కోసం మధిరకు వస్తుండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. గతంలో ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, పోస్టాఫీస్, బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో కూడా ఆధార్ కేంద్రాలు ఉండగా.. ఇటీవల వాటిని తొలగించారు. దీంతో లక్షలాదిమంది ప్రజలు మెయిన్ రోడ్‌లో ఉన్న తెలంగాణ గవర్నమెంట్ మీ సేవా కేంద్రాన్ని ఆశ్రయించాల్సి వస్తుంది.

క్యూలో నిలబడలేక వెనుదిరిగిన గర్భిణీ..

మధిర మండలం దెందుకూరు గ్రామానికి చెందిన నిండు గర్భిణి కోట రత్నకుమారి తన మూడేళ్ల కుమార్తె జెస్సీకు ఆధార్ కార్డు నమోదు కోసం బుధవారం మధిరకు వచ్చింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యూలో ఉండి నిలబడలేక తిరిగి ఇంటికి వెళ్లి మరుసరి రోజు వచ్చి మధ్యాహ్నం 3 గంటల వరకు వేచి ఉంది. ఆ చిన్నారితో ఆమె ఎండ తీవ్రతకు ఇబ్బంది పడాల్సి వచ్చింది. ఇలా ప్రతి ఒక్కరూ ఎండకు, ఉక్కపోతకు ఇబ్బంది పడుతున్నారు.

ఉదయం 5 గంటలకే కేంద్రాల వద్దకు..

కులం, ఆదాయ, జనన, మరణ, నివాస తదితర ధ్రువీకరణ పత్రాల కోసం ఉదయం 5 గంటలకే మెయిన్‌రోడ్‌లో ఉన్న ఆధార్ కేంద్రం వద్దకు ప్రజలు బారులుదీరుతున్నారు. ఈక్రమంలో వృద్ధులు, మహిళలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు రాత్రి 10 గంటల వరకు వేచి ఉండి తీవ్ర అవస్థలు పడుతున్నారు.



మీ సేవా కేంద్రంలో బిజీగా ఉన్న నిర్వాహకులు

కాసులు వచ్చే పనులపైనే దృష్టి..

తెలంగాణ గవర్నమెంట్ మీసేవా కేంద్రం ద్వారా సుమారు 150 సర్వీస్‌లు అందుతుండడంతో ప్రతి ఒక్కరూ ఈ కేంద్రానికే వచ్చిపోతుంటారు. ప్రజలు పలుమార్లు మీసేవ కేంద్రాల గురించి తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం ఉండడం లేదు. తహసీల్‌కు కూతవేటు దూరంలో ఉన్న కేంద్రాన్నే అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. కాసులు వచ్చేవాటికే అధికారులు పనిచేస్తారని ఆరోపిస్తున్నారు.

సమస్యగా మారిన నివాస ధ్రువీకరణ పత్రం..

నివాస ధ్రువీకరణ పత్రాల కోసం ప్రజల దరఖాస్తు చేసుకుంటే వాటిని తహసీల్దార్ మంజూరు చేయడం లేదు. ఇటీవల ఆధార్ మీసేవా కేంద్రాల నిర్వాహకులను పిలిపించి తహసీల్దార్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆధార్‌లోని అడ్రస్ మార్పు కోసం రెసిడెన్స్ సర్టిఫికెట్ తప్పనిసరి కావడంతో వందలాది దరఖాస్తులు వస్తున్నాయని, ఇబ్బందిగా ఉందని, గెజిటెడ్ సంతకం పెట్టించుకుని వస్తే వారికి ఆధార్ నమోదు చేయాలని హుకుం జారీ చేశారు. అయితే గెజిటెడ్ సర్టిఫికెట్‌తో దరఖాస్తు చేస్తే ఒక్కోసారి రిజెక్ట్ కావడంతో పాటు ఆధార్ కేంద్రంలో ఐడీ లాగిన్ బ్లాక్ అయి కేంద్రం మూతపడే పరిస్థితి ఉంటుందని నిర్వాహకులు తెలుపుతున్నారు. లక్షలాది మంది ప్రజలకు అవసరమైన కేంద్రాలను అదనంగా ఎందుకు మంజూరు చేయడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

రెండ్రోజులు తిరగాల్సి వచ్చింది...



బ్యాంక్ అకౌంట్‌కు ఆధార్ కార్డును లింక్ కాకపోవడంతో బ్యాంకుల నుంచి ఎటువంటి మెసేజ్‌లు రావడం లేదు. రెండ్రోజుల నుంచి మీ సేవా కేంద్రం చుట్టూ తిరుగుతున్నప్పటికీ పని కావడం లేదు. ప్రజలు ఇంతలా ఇబ్బందులు పడుతున్నా.. అధికారులు మాత్రం తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. అదనపు కేంద్రాలను ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– దూదేకుల నాగూర్‌బీ, మర్లపాడు

రాష్ట్రం మార్పునకు తొందర లేదు...



ఆధార్‌కార్డులోని ఆంధ్రప్రదేశ్ స్టేట్ పేరు మార్పు కోసం ప్రజలు తొందరపడాల్సిన పని లేదు. రెసిడెన్స్ సర్టిఫికెట్స్ లేకుండా గెజిటెడ్, బ్యాంకు పాస్‌బుక్, ఓటరు గుర్తింపు కార్డు వంటి వాటిని ఆధారంగా చేసుకుని ఆధార్ నమోదు చేయాలని నిర్వాహకులకు సూచించాం. ప్రజలు కూడా ఆందోళన చెందకుండా ఖాళీ సమయం చూసుకొని ఆధార్ కేంద్రాలకు వెళ్లాలి.

– వెంకటేశ్వర్లు, తహసీల్దార్, మధిర

కేసీఆర్ హ్యాట్రిక్ విజయం ఖాయం

రాష్ట్ర విత్తనాభివద్ధి సంస్థ చైర్మన్ కోటేశ్వరరావు



మాట్లాడుతున్న కోటేశ్వరరావు

ఎర్రుపాలెం: అభివృద్ధి, సంక్షేమంలో దూసుకెళ్తున్న సీఎం కేసీఆర్ మరోసారి విజయం సాధించి హ్యాట్రిక్ సీఎం కావడం ఖాయమని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు ధీమా వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మధిర మార్కెట్ మాజీ చైర్మన్ చావా రామకృష్ణతో కలిసి బుధవారం ఆయన మాట్లాడారు. ప్రశాంతంగా పాలన సాగుతున్న రాష్ట్రంలో హత్యా రాజకీయాలను ప్రోత్సహించవద్దని విపక్ష పార్టీలకు సూచించారు. అలజడులు, అల్లర్లు సృష్టించ కుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికల జరిగేలా చూడాలన్నారు. రైతులకు అంతరాయం లేకుండా 24గంటలు అందిస్తున్న రాష్ట్రంగా తెలంగాణకు పేరుండగా, రైతుబంధు, దళితబంధు, బీసీ బంధు ఎక్కడా అమలుకావడం లేదని తెలిపారు. ఏదిఏమైనా మధిరలో లింగాల కమల్‌రాజ్‌తో పాటు ఉమ్మడి జిల్లాలో పదికి పది అసెంబ్లీ సీట్లు గెలుస్తామని ఆయన చెప్పారు. అనంతరం రామన్నపాలెంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంపీపీ దేవరకొండ శిరీష, జెడ్పీటీసీ శీలం కవిత, నాయకులు పంబి సాంబశివరావు, యన్నం శ్రీనివాసరెడ్డి, శెట్టిపల్లి మదన్‌రెడ్డి, కుడుముల మల్లికార్జున్‌రెడ్డి, రామిశెట్టి రామకృష్ణ, కొండెపాటి సాంబశివరావు, నగ్గుర్తి కిశోర్, దేవరకొండ రవి, గుర్రాల పుల్లారెడ్డి, దేవరకొండ చిరంజీవి, కృష్ణారెడ్డి, చెన్నంరాజు పురుషోత్తంరాజు, తదితరులున్నారు.

సీస్ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి



చింతకాని: మాట్లాడుతున్న ఎంఈఓ శ్యాంసన్

కొణిజర్ల/చింతకాని: స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ సర్వే (సీస్) పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ మోదుగు శ్యాంసన్ తెలిపారు. ఈ నెల 3న అన్ని ప్రభుత్వ ప్రైవేట్, గురుకుల పాఠశాలల్లో సీస్ పరీక్ష నిర్వహిస్తున్నారు. 3,6,9 తరగతులకు ఈ పరీక్ష నిర్వహించనున్నారు. కొణిజర్ల మండల వ్యాప్తంగా 3వ తరగతిలో 367 మంది, 6వ తరగతిలో 379 మంది, 9లో 384 మంది మొత్తం 1,130 మంది బాల బాలికలు పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. అదే విధంగా చింతకాని మండలంలోని 3వ తరగతిలో 246 మంది, 6లో 250 మంది, 9లో 246 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఫీల్డ్ ఇన్విగేటర్‌లకు పరీక్ష నిర్వహిణపై శిక్షణ ఇచ్చామని, పరీక్ష పకడ్బందీగా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమాలల్లో మండల నోడల్ అధికారి శ్రీనివాసరావు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, మండల కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ సేవలు వినియోగించుకోవాలి

చింతకాని: దివ్యాంగ పిల్లల కోసం నిర్వహించే ఫిజియోథెరపీ సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని వైద్యురాలు వల్లూరి వసంత అన్నారు. మండలంలోని లచ్చగూడెం ఉన్నత పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర సమగ్ర శిక్ష అభియాన్ సహకారంతో మండల విద్యాశాఖాధికారి పర్యవేక్షణలో ప్రత్యేక అవసరాలు కలిగిన దివ్యాంగ పిల్లలకు బుధవారం ఫిజియోథెరపీ వైద్యసేవలను నిర్వహించారు. కార్యక్రమంలో ఐఈఆర్పీలు కేఎస్ కృష్ణారావు, భూక్యా దస్లీ, భవిత కేంద్రం సంరక్షురాలు అరికొట్ల లలితకుమారి, పాల్గొన్నారు.



ఫిజియోథెరపీ చేస్తున్న వైద్యురాలు వసంత

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థి ఎంపిక



వ్యాయామ ఉపాధ్యాయుడు హరీష్‌తో వీరేందర్

కొణిజర్ల: రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు కొణిజర్ల మండలం అమ్మపాలెంలో గల తెలంగాణ మైనార్టీ గురుకుల బాలుర పాఠశాల విద్యార్థి ఎ.వీరేందర్ ఎంపికయ్యాడు. ఈ నెల 1న ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగిన అండర్ 17 అథ్లెటిక్స్ డిస్కస్ త్రో విభాగంలో వీరేందర్ ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఆర్.సైదులు, వ్యాయామ ఉపాధ్యాయుడు హరీష్ విద్యార్థిని అభినందించారు.

డ్రెయిన్ పనులు పూర్తి చేయండి

వైరా: వైరా మున్సిపాలిటీ 8వ వార్డు బోడేపూడి కాలనీ వాసులకు మంజూరైన డ్రెయిన్ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలంటూ కాలనీ వాసులు బుధవారం మున్సిపల్ ఏఈ శంకర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మసీదు నుంచి కోట వెంకటరమణ ఇంటి వరకు నిర్మించాల్సిన సీసీ, డ్రెయిన్ పనులు విస్మరించారన్నారు. వార్డులో అన్ని వీధుల పరిస్థితి ఇలాగే ఉందన్నారు. దీంతో ఏఈ శంకర్ మాట్లాడుతూ.. కాంట్రాక్టర్‌తో కలిసి వార్డులు పరిశీలించి తప్పక పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు.

అయ్యప్పస్వామికి అభిషేకాలు

కారేపల్లి: కారేపల్లి సాయిబాబా మందిర ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అయ్యప్ప స్వామి మహాపీఠాల వద్ద అయ్యప్పస్వామికి బుధవారం అభిషేకం చేశారు. పూజారులు నాగసాయిశర్మ, సురేష్‌శర్మ, బాలక్రిష్ణ గురుస్వామిల ఆధ్వర్యంలో.. అయ్యప్ప మాలాధారులు అయ్యప్పస్వామికి అభిషేకాలను నిర్వహించారు. గురుస్వాములు గొడుగు శ్రీను, సారయ్య, రాందాస్, శంకర్, కేలిమళ్ల శ్రీను, సంగు సాయి, వెంకటేశ్వర్లు, సమ్మయ్య, పాల్గొన్నారు.

పేద విద్యార్థికి చేయూత

సత్తుపల్లిరూరల్: మండలంలోని కొత్తూరు మదర్‌థెరిస్సా ఇంజినీరింగ్ కళాశాలలో డిప్లమా ప్రథమ సంవత్సరం చదువుతున్న లచ్చన్నగూడెంకు చెందిన విద్యార్థి పగుట్ల మనో హర్షిత్‌కు గాంధీనగర్ పాఠశాల ఉపాధ్యాయులు కంభంపాటి వెంకటేష్ బుధవారం రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

బోనకల్: పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని రాపల్లి గ్రామంలో వైరస్ సోకిన మిర్చి పంటను సీపీఐ నాయకులు పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, పవన్, రవి తదితరులు పాల్గొన్నారు.

భట్టి విక్రమార్కను గెలిపించండి



ప్రవీణ్‌కుమార్ తల్లి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న మల్లు నందిని

ఎర్రుపాలెం: మధిర నియోజకవర్గ ఎమ్మెల్యేగా భట్టి విక్రమార్కను మరోసారి గెలిపించాలని మల్లు నందిని అన్నారు. బుధవారం మండలంలో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పార్టీ నాయకులు, కార్యకర్తలు భట్టి గెలుపే లక్ష్యంగా విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. ఇటీవల పార్టీ నాయకుడు షేక్.లాల్‌మహమ్మద్ మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులను, ఆర్ఎంపీ వైద్యులు ఎం.ప్రవీణ్‌కుమార్ మాతృ వియోగం చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసరావు, ఇస్మాయిల్, నర్సింహారావు, లక్ష్మణరావు, వెంకటనర్సయ్య, బాషా, బాబు, జనార్దన్, వెంకటరత్నం, శివ, వాసు, కొండ, సాయి ఉన్నారు.

కాంగ్రెస్‌ను ఆదరించాలి..

బోనకల్: ప్రజలకు అండగా కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని కాంగ్రెస్ పార్టీ మహిళా మండల అధ్యక్షురాలు అమిరేశి ప్రమీల అన్నారు. మండలంలోని ముష్టికుంట్ల గ్రామంలో బుధవారం రాత్రి విస్తృత ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల నాయకురాలు రమ, సుజాత, జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు షేక్ షాజాహాన్, నాగేశ్వరరావు, సీతయ్య, మురళి పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తుల వెల్లువ



సత్తుపల్లిలో దరఖాస్తు చేసుకుంటున్న దృశ్యం

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్ల కోసం దరఖాస్తులు వెల్లువలా వచ్చాయి. ఎన్నికల రిటర్నింగ్ అధికారి అశోక్‌చక్రవర్తి ఆధ్వర్యాన ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో ఉద్యోగులు, పోలింగ్ సిబ్బంది, పాత్రికేయులు, దివ్యాంగులు, వృద్ధులు, ఎమర్జెన్సీ సర్వీస్ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ కోసం ఫాం–12 దరఖాస్తులను అందించారు. ఇప్పటి వరకు 909 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

టీడీపీ నేతల పాదయాత్ర

మధిర: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుకు మధ్యంతర బెయిల్ రావడంతో తెలంగాణ రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం ఆధ్వర్యంలో పాదయాత్ర చేపట్టారు. మధిర పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్ నుంచి జమలాపురం శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి ఆ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ పాదయాత్రకు మండల కాంగ్రెస్ అధ్యక్షులు సూరంశెట్టి కిశోర్, పారుపల్లి విజయ్, వంశీకృష్ణ, దెందుకూరు సొసైటీ అధ్యక్షులు వెంకటకృష్ణ సంఘీభావం తెలిపారు.

సత్తుపల్లిలో సీపీఎం పోటీ చేస్తుంది

సత్తుపల్లిటౌన్/వేంసూరు: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఎం అభ్యుదయ శక్తులు, వామపక్షాలతో కలిసి పోటీ చేయనున్నట్లు ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు మోరంపూడి పాండు రంగారావు, సీపీఎం జిల్లా నేత చలమాల విఠల్‌రావులు తెలిపారు. బుధవారం వేంసూరు మండలంలోని శంబూనిగూడెంలో సీనియర్‌నేత అర్వపల్లి గోపాలరావు అధ్యక్షతన, సత్తుపల్లిలో సీపీఎం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ, కాంగ్రెస్ పార్టీలు కమ్యూనిస్టులపై తప్పుడు ప్రచారం చేస్తున్నాయని, తాము ఒంటరి కాదని.. తమతో శ్రామికవర్గం ఉందని.. రానున్న ఎన్నికల్లో వామపక్షాల బలం చూపిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పట్టణ కార్యదర్శి రావుల రాజబాబు, కొలికపోగు సర్వేశ్వరరావు, వెంకట్రావ్, రమేష్, ఝాన్సీ, కుమారి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, జగన్ మోహన్‌రావు, నరసింహారావు, మోహన్‌రావు, మధు, సత్యం, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



వేంసూరు: మాట్లాడుతున్న చలమాల విఠల్‌రావు

ప్రజలు విజ్ఞతతో ఓటు వేయాలి

వైరా: వైరా నియోజకవర్గంలో కొందరు డబ్బుతో గెలవాలని చూస్తున్నారని.. కావున ప్రజలు విజ్ఞతతో ఓటు వేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బొందు రాంబాబు అన్నారు. బుధవారం వైరా సీపీఎం కార్యాలయంలో కురుగుంట్ల శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైరా నియోజకవర్గ ఎన్నికల బరిలో సీపీఎం నిలుస్తుందని, ఓటుకు నోటు కాకుండా ప్రజా ఉద్యమాలకు ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బొంతు సమత, మందడపు రామారావు, ఎస్‌కే జమాల్, శీలం నారాయణరెడ్డి, వడ్లమూడి మధు, ఎస్‌కే పాషా తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ ప్రభాకర్‌రెడ్డిపై దాడి హేయం

కొణిజర్ల: ఎంపీ కొత్తా ప్రభాకర్‌రెడ్డిపై మంగళవారం జరిగిన కత్తిపోటు దాడిని కొణిజర్ల జెడ్పీటీసీ పోట్ల కవిత ఖండించారు. బుధవారం ఆమె కొణిజర్లలో మాట్లాడుతూ.. తెలంగాణలో బీఆర్ఎస్ విజయాన్ని తట్టుకోలేని ప్రతిపక్ష పార్టీల నాయకులు హత్యా రాజకీయాలకు పాల్పడుతున్నారన్నారు. రాజకీయాలు చేయాలి కానీ హత్యా రాజకీయాలు తగవన్నారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలన్నారు.

మధిర బాలోత్సవ్ బ్రోచర్ల ఆవిష్కరణ

మధిర: రామభక్త సీతయ్య కళాపరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 13,14 తేదీల్లో నిర్వహించనున్న మధిర బాలోత్సవ్ కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్లను బుధవారం శ్రీ లక్ష్మి పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కళాపరిషత్ అధ్యక్షుడు పుతుంబాక శ్రీకృష్ణ ప్రసాద్, కార్యదర్శి బాబ్లా మాట్లాడుతూ.. కళాపరిషత్ ఆధ్వర్యంలో 26వ జాతీయ మధిర బాలోత్సవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బంజారా కాలనీలో ఉన్న స్వామి కల్యాణ మండపంలో ఈ పోటీలు జరుగుతాయన్నారు. 13న ఉదయం 10 గంటల నుంచి శాస్త్రీయ నృత్యాలు, జానపద నృత్యాలు ఉంటాయని, 14న నీతి పద్యాలు, నీ సత్తా చాటుకో, ఏకపాత్రలు, విచిత్ర వేషాలు ఉంటాయని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఎంట్రీ ఫాం లను ఈ నెల 8లోగా అందించాలన్నారు. ఇతర వివరాల కోసం 9440675787 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో కల్యాణపు పుల్లారావు, గుర్రాల నాగిరెడ్డి, కటకం నరసింహారావు, ముత్తయ్య, నాగేంద్ర శ్రీనివాసరావు పాల్గొన్నారు.



బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న బాలోత్సవ్ నిర్వాహకులు

సేవాగుణాన్ని అలవర్చుకోవాలి

చింతకాని: ప్రతి ఒక్కరూ సేవాగుణాన్ని అలవర్చుకోవాలని క్రీస్తు సంఘం పాస్టర్ వేముల ఆకాష్ తెలిపారు. మండల కేంద్రంలో క్రీస్తు సంఘం ఆధ్వర్యంలో నిరుపేదలకు బుధవారం దుప్పట్లు, దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్రీస్తు సంఘం జగ్గయ్యపేట పాస్టర్లు విజయరాజు, ప్రకాష్ డేవిడ్ రాజ్, విశ్వవాణి పాస్టర్ విజయ్‌కుమార్, సీబీటీ ప్రిన్సిపాల్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పాలస్తీనాపై దాడులు ఆపాలి



సత్తుపల్లిరూరల్: అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

తల్లాడ/సత్తుపల్లిరూరల్: పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులను ఆపాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మాదినేని రమేష్, సీపీఎం జిల్లా నాయకులు మోరంపూడి పాండు, జాజిరి శ్రీనివాసరావులు తెలిపారు. బుధవారం తల్లాడలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. అదే విధంగా సీపీఎం ఆధ్వర్యంలో సత్తుపల్లిరూరల్ మండలంలోని స్థానిక అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. సమస్యలు వచ్చినప్పుడు ఏ దేశాలైనా సామరస్యపూర్వకంగా చర్చల ద్వారా పరిష్కారం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు శీలం సత్యనారాయణరెడ్డి, శీలం ఫకీరమ్మ, నల్లమోతు మోహన్‌రావు, అయినాల రామలింగేశ్వరరావు, పులి వెంకటనరసయ్య, సీపీఎం నాయకులు రావుల రాజబాబు, కె.సర్వేశ్వరరావు, ఝాన్సీ, రమేష్, వెంకటేశ్వరరావు, వెంకట్రావ్, నీరజ్, రాము, లక్ష్మణ్‌రావు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



మాట్లాడుతున్న క్రైమ్ ఏసీపీ శంకర్

వైరా: ప్రతిఒక్క విద్యార్థి సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని సైబర్ క్రైమ్ ఏసీపీ శంకర్ అన్నారు. బుధవారం వైరాలోని ఠాగూర్ విద్యాసంస్థలైన డిగ్రీ కళాశాల, క్రాంతి జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ వారి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనతో పాటుగా క్రైమ్ డిపార్ట్‌మెంట్ సీఐ నరసింహారావు మాట్లాడుతూ.. ఫేస్‌బుక్, వాట్సప్, ఇన్‌స్టాగామ్ వంటి నెట్ కనెక్షన్ల ద్వారా నేరాలకు పాల్పడటం జరగుతుందన్నారు. ఎవరైన మోసానికి పాల్పడినట్లైతే టోల్‌ఫ్రీ నంబర్ 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. మోసాలకు ఎక్కువగా యువతీ యువకులే బలైపోతున్నారన్నారు. కరస్పాడెంట్ సంక్రాంతి రవికుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎస్సై రంజిత్, ఏఎస్సై వెంకటనారాయణ, బాల్యా, సీహెచ్ కృష్ణారావు, ఎన్ఎస్ఎస్ లింగారావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

సత్తుపల్లిరూరల్: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం డీఈఓ సోమశేఖర శర్మకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. మధ్యాహ్న కార్మికులకు సరుకులు, కూరగాయలు, పప్పులు, అల్పాహారానికి సంబంధించిన వంట పాత్రలు సమకూర్చాలని కోరారు. కనీసం వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, బీమా సదుపాయం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు నిమ్మటూరి రామకృష్ణ, తెలగారపు రామారావు, లక్ష్మీ, కృష్ణమ్మ, కృష్ణవేణి, కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభకు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు

సీఎం కేసీఆర్ కల్లూరులో బుధవారం నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు ముఖ్యంగా మహిళలు తరలి వెళ్లారు. నియోజకవర్గ స్థాయిలో కల్లూరులో ఏర్పాటు ఈ ఎన్నికల సభకు ప్రజలు భారీగా తరలి వచ్చారు. సభకు హాజరైన ప్రజలను చూసి కేసీఆర్ సంతోషం వ్యక్తం చేయడం జరిగింది.

– సాక్షి నెట్‌వర్క్



తల్లాడ: ర్యాలీ ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సాగునీటి సరఫరా.. బీజేపీ తొలి విజయం



సాగర్‌కాలువ వద్ద సాగునీటి సరఫరాను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

కల్లూరు: కల్లూరులోని సాగర్‌కాలువకు సాగునీరు వదలడం బీజేపీ తొలివిజయమని బీజేపీ ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు అన్నారు. బుధవారం సాగర్ కెనాల్ వద్ద సాగునీటి సరఫరాను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గానికి సీఎం వస్తున్నాడని, రైతులు ఎక్కడ ఆందోళన చెందుతారోనని సాగునీరు వదిలినట్లు పేర్కొన్నారు. బహిరంగ సభ కాగానే సాగునీటిని నిలిపి వేయకుండా కనీసం 10 రోజులైన సాగునీరు అందించాలన్నారు. కార్యక్రమంలో కల్లూరు, తల్లాడ, పెనుబల్లి మండల అధ్యక్షులు రామకృష్ణ, రామారావు, నరసింహారావు, నియోజకవర్గ కన్వీనర్ వీరంరాజు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ప్రసాద్, నాయకులు నాగేశ్వరరావు, బాలాజీ నాయక్, అనీల్‌కుమార్, పుల్లారావు, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.